మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 58 గురువారం 31 - 07 - 2025 పేజీలు: 8 వెల: 4

## ఆహార పదార్థాలు శుభ్రంగా ఉండాలి



3లో..

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

# పర్యటన విజయవంతం

మనగళం, కర్నూలు సిటీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఉమ్మడి కర్నూలు జిల్లాల పర్యటన విజయవంతం అయ్యింది. గతంలో ఎన్నడూ లేనంతంగా పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావడంతో జిల్లా కేంద్రాలు కిటకిటలాడాయి. బీజేపీ దండు కదం తొక్కింది. రెండు జిల్లాల్లో నిర్వహించిన ర్యాలీలో ప్రధాని మోదీ నాయత్వం వర్ధిల్లాలి అనే నినాదాలు హోరెత్తాయి. కర్నూలు జిల్లా విస్తృత కార్యకర్తల సమావేశం ఆర్య కన్వెన్షన్ హాల్, మౌర్య ఇన్ హోటల్లో నిర్వహించారు. కర్నూలు జిల్లా బీజేపీ అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ అధ్యక్షతన, జిల్లా ఇంచార్జి అంకాలు రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర ఆధ్వర్యంలో సమావేశం సాగింది. ఆంధ్రప్రదేశ్ లో బీజేపీని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. ఉదయం కర్నూలు ఎస్టీబీసీ కాలేజీలో చాయ్ పే చర్చలో స్థానికులతో పీవీఎన్ మాధవ్ ముచ్చటించిన తీరు ప్రత్యేకంగా నిలిచింది. తరువాత ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, అటు నుంచి ఎగ్జిబిషన్







గ్రౌండ్స్ చేరుకున్నారు. అక్కడి నుంచి మౌర్య ఇన్ హోటల్ వరకు బీజేపీ కార్యకర్తలతో భారీ ఎత్తున శోభాయాత్ర సాగింది. జిల్లా సమావేశం అనంతరం కార్యకర్తలతో కలిసి భోజనం చేసి, సాయంత్రం మేధావుల సదస్సులో పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. తదనంతరం కొండారెడ్డి బురుజు చేరుకొని అంబేద్కర్ విగ్రహాన్నికి పూలమాల వేసి నివాళు లర్పించారు. పక్కనే ఉన్న పార్క్ లో విలేకరులతో మాట మంతి నిర్వహించారు పీవీఎన్ మాధవ్. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలు, నాయకులు చూపిన అభిమానం అభినందనీయమ న్నారు. కష్టపడే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. బీజేపీ బలోపేతానికి అంకితభావంతో పాటుపడాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ముఖ్య నాయకులు, జిల్లా ముఖ్య నాయకులు , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అసెంబ్లీ కన్వీనర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, జిల్లా లోని ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు, బూతు అధ్యక్షులు, భారీ ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.



# రష్యాలో భారీ భూకంపం

### మరిన్ని దేశాలకు సునామీ ముప్పు...

మన గళం, న్యూఢిల్లీ : రష్యాలో భారీ భూకంపం సంభవించడంతో ప్రపంచ దేశాల్లోనూ కలకలం రేగింది. 8.8 తీవ్రతతో ప్రకంపనలు రావడంతో పలు దేశాలను సునామీ తాకింది. తాజాగా, అమెరికా సునామీ హెచ్చరికల వ్యవస్థ మరికొన్ని దేశాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసింది. రష్యా, హవాయి దీవులు, ఈక్వెడార్ 3 మీటర్ల కంటే ఎత్తయిన అలలతో సునామీ వచ్చే అవకాశం ఉంది. జపాన్, చిలీ, కోస్టారికా, పెరు, సోలోమన్ ఐలాండ్స్, కిరిబాటి, సమోవా, ఫ్రెంచ్ పాలినేషియా దీవులు, గ్వామ్, పాల్మిరా ఐలాండ్, మిడ్ వే ఐలాండ్, జాన్ స్టన్ అటోల్, జార్విస్ దీవులకు 1 మీటర్ నుంచి 3 మీటర్ల అలలతో సునామీ వచ్చే అవకాశం ఉంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేషియా, ఫిజీ, ఎల్ సాల్వడార్,

2 లో..

# నింగిలోకి నైసార్ ఉపగ్రహం



**- షార్ నుంచి ప్రయోగించిన జీఎస్ఎల్వీ-ఎఫ్16**

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో, నాసా కలిసి ప్రయోగించిన నైసార్ ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వీ-ఎఫ్16 వాహక నౌక నింగిలోకి మోసుకెళ్లింది. ఇప్పటివరకు ప్రపంచ దేశాలు ప్రయోగించిన వాటిలో ఇదే అత్యంత ఖరీదైన ఉపగ్రహంగా నిలవనుంది. ఈ వాహక నౌకను తిరుపతి జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి విజయవంతంగా ప్రయోగించారు నాసా, ఇస్రో కలిసి రూపొందించిన సింథటిక్ ఎపెర్చెర్ రాడార్ ఉపగ్రహం కోసం నాసా 1.16 బిలియన్ డాలర్లు సమకూర్చింది. అలాగే భారత్ 90 మిలియన్ డాలర్లు కేటాయించింది. ఈ నైసార్ ఉపగ్రహం అత్యంత శక్తివంతమైన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్లలో ఒకటిగా నిలిచింది. దాదాపు 2392 కిలోల బరువు గల ఈ ఉపగ్రహం.. జీఎస్ఎల్వీ బయలుదేరిన 18:59 నిమిషాలకు భూమి నుంచి 747 కిలోమీటర్ల ఎత్తులో విడిపోనుంది.



### రైల్వే మంత్రిని కలిసిన

# ఎంపీ బైరెడ్డి శబరి

మనగళం, నంద్యాల : రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను బుధవారం ఎంపీ బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిశారు. నంద్యాల పార్లమెంట్ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న రైల్వే సంబంధిత ప్రధాన సమస్యలను ఈ సందర్భంగా ఎంపీ... మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రయాణికుల సౌకర్యం, మెరుగైన కనెక్టివిటీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలపై మంత్రితో ఎంపీ చర్చించారు. సమస్యల పరిష్కారినికి చర్యలు తీసుకుంటామని రైల్వే మంత్రి హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

### ఏపీకి తిరుగు ప్రయాణమైన

# సీఎం చంద్రబాబు



- ఏపీ బ్రాండ్ ఇమేజ్ ను పెంచడమే లక్ష్యంగా సింగపూర్ పర్యటన
- అవిశ్రాంతంగా సమావేశాలు, సదస్సులకు హాజరు
- మొత్తం 26 కార్యక్రమాలకు హాజరైన చంద్రబాబు, లోకేశ్, ఇతర మంత్రులు, అధికారులు

మన గళం, అమరావతి : పెట్టుబడులను ఆకర్షించటం, ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు చేపట్టిన సింగపూర్ పర్యటన విజయవంతంగా ముగిసింది. మంత్రులు నారా లోకేశ్, పి.నారాయణ, టీజీ భరత్ సహా ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి సింగపూర్ లో నాలుగు రోజుల పాటు అవిశ్రాంతంగా వివిధ సమావేశాలు, రౌండ్ టేబుల్ చర్చల్లో పాల్గొన్నారు. సింగపూర్ లోని ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను సందర్శించి వాటిని రాష్ట్రంలో అమలు చేసేందుకు వీలుగా అధ్యయనం చేశారు. పర్యటనలో మొత్తం 26 కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు, మంత్రులు హాజరయ్యారు. పర్యటన మొదటి నుంచి చివరి రోజు వరకూ క్షణం తీరిక లేకుండా ఆసాంతం రాష్ట్ర అభివృద్ధి కాంక్షతో నిరంతరం చర్చలు, సంప్రదింపులు జరిపారు. సింగపూర్ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నం, మాజీ ప్రధాన మంత్రి, ప్రస్తుత సీనియర్ మంత్రి లీ సైన్ లూంగ్, అలాగే వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి టాన్ సీ లెంగ్, సెక్యూరిటీ, హోం వ్యవహారాల మంత్రి కె.షణ్ముగం తదితరులతో సీఎం సమావేశమయ్యారు. ఏపీ-సింగపూర్ మధ్య సహకారాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్, అమరావతి అభివృద్ధిలోనూ భాగస్వామ్యం వహించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకునేందుకు వచ్చినట్టు అక్కడి ప్రభుత్వ ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించి చెప్పారు. నవంబరు 14-15 తేదీల్లో విశాఖలో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు హాజరుకావాల్సిందిగా సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధుల్ని సీఎం ఆహ్వానించారు.



### 23,000 మంది మహిళలు, బాలికలు

# మిస్సింగ్..

**అసెంబ్లీకి వెల్లడించిన సీఎం**

మన గళం, భోపాల్: సుమారు 23,000 మంది మహిళలు, బాలికలు కనిపించడం లేదు. అత్యాచారం, మహిళలపై జరిగిన నేరాలతో సంబంధం ఉన్న 1,500 మంది నిందితులు పరారీలో ఉన్నారు. ఆ రాష్ట్ర సీఎం ఈ విషయాలను స్వయంగా అసెంబ్లీకి వెల్లడించారు. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో మహిళలు, బాలికలు అదృశ్యమవుతున్నారు. మహిళలపై అత్యాచార కేసులు కూడా పెరుగుతున్నాయ. మాజీ హోంమంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలా బచ్చన్ దీనిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కేసుల వివరాలను అసెంబ్లీలో కోరారు. కాగా, మధ్యప్రవేశ్ సీఎం మోహన్ యాదవ్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 2024 జనవరి 1 నుంచి 2025 జూన్ 30 వరకు 21175 మంది మహిళలు, 1954 మంది బాలికలు

2 లో..

### తప్పు చేస్తే జగన్

# అరెస్ట్ కావడం ఖాయం



మన గళం, అనంతపురం : ఏపీలో మద్యం వ్యవహారంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ తప్పు చేస్తే తప్పకుండా అరెస్టవుతారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. మద్యం స్కామ్ లో సింగిల్ టెండర్‌తో ఒకరే సప్లై చేశారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ క్యాష్ పేమెంట్లు ఎందుకు తీసుకోలేదంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. బుధవారం అనంతపురం జిల్లాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా విలేకర్లతో బీజేపీ రాష్ట్ర

2 లో..

# రష్యాలో భారీ భూకంపం



గ్వాటెమాలా, పపువా న్యూగినీ, తైవాన్, ఫిలిప్పీన్స్, నికరాగువా, మెక్సికో, కొలంబియా, పనామా, కుక్ ఐలాండ్స్, అంటార్కిటికా ప్రాంతాలకు 0.3 మీటర్ల నుంచి 1 మీటరు ఎత్తు అలలో సునామీ వచ్చే అవకాశం ఉంది. చైనా, ఉత్తర కొరియా, దక్షిణ కొరియా, వియత్నాం, బ్రూనై, మలేషియా దేశాలకు 0.3 మీటర్ల కంటే తక్కువ ఎత్తుతో అలలు వచ్చే అవకాశం ఉందని అమెరికా సునామీ హెచ్చరికల వ్యవస్థ వెల్లడించింది.

# 23,000 మంది మహిళలు, బాలికలు మిస్సింగ్..

అదృశ్యమయ్యారు. ఏడాదికిపైగా ఆ రాష్ట్రంలో తప్పిపోయిన మహిళల సంఖ్య 23129కు చేరుకున్నదని వెల్లడించారు. మరోవైపు అత్యధికంగా సాగర్ జిల్లాలో 1,069 మంది మహిళలు మిస్సింగ్ అయ్యారు. జబల్పూర్ జిల్లాలో 946 మంది, ఇండోర్ జిల్లాలో 788 మంది, భోపాల్ (గ్రామీణ) జిల్లాలో 688 మంది, ఛతర్‌పూర్ జిల్లాలో 669 మంది, రేవా జిల్లాలో 653 మంది, ధార్ జిల్లాలో 637 మంది, గ్వాలియర్ జిల్లాలో 617 మంది మహిళలు అదృశ్యమయ్యారు. కాగా, అత్యాచారం, మహిళలపై జరిగిన నేరాలతో సంబంధం ఉన్న 1,500 మంది నిందితులు పరారీలో ఉన్నారు. మహిళలపై అత్యాచారం చేసిన నిందితుల్లో 292 మంది, మైనర్లపై అత్యాచారానికి పాల్పడిన నిందితుల్లో 283 మంది అంటే మొత్తంగా 575 మంది అత్యాచార నిందితులు ఇప్పటికీ స్వేచ్ఛగా తిరుగుతున్నట్లు ప్రభుత్వ గణాంకాల ద్వారా తెలుస్తున్నది. లైంగిక వేధింపుల కేసుల్లో పరారీలో ఉన్న వారి సంఖ్య 610కు చేరింది. మహిళలు, బాలికల అదృశ్యానికి సంబంధించిన ఇతర కేసుల్లో 320 మంది నిందితులు పరారీలో ఉన్నారు.

## మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను

# సందర్శించిన మంత్రి నారా లోకేశ్

- చంద్రబాబు నాయకత్వంలో సింగపూర్‌లో ఏపీ బృందం పర్యటన
- వరుస భేటీలతో నారా లోకేశ్ ఫుల్ బిజీ
- పలు టెక్ కంపెనీల ప్రముఖులతో సమావేశాలు

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ బృందం సింగపూర్ సెసిల్ స్ట్రీట్ లోని మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ను సందర్శించింది. అక్కడ ఏఐ గోస్టోర్ లోని వివిధ పరిశ్రమలు, ఆరోగ్య సంరక్షణ, ఎఫ్ఎస్ఐ, తయారీ, వినియోగదారు పరిశ్రమల్లో ఏఐ వినియోగ దృశ్యాలను నారా లోకేశ్, ఏపీ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రత్యేకతలను వివరిస్తూ... వ్యాపారులు, వినియోగదారులు, ప్రేక్షకుల కోసం సంయుక్తంగా రిటైల్, ఎడ్యుకేషన్ మద్దతును అందించేందుకు మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎగ్జిక్యూటివ్ బ్రీఫింగ్‌లు, పరిశ్రమ పరిష్కారాలను ఊహించడం, ఆవిష్కరణల వర్క్‌షాప్‌లు, హ్యాండ్స్-ఆన్ ల్యాబ్‌లు, క్లయింట్ల డిజిటల్ పరివర్తన మార్గాలపై దృష్టి సారించడం వరకు ఇక్కడ తమసేవలు విస్తరించినట్లు చెప్పారు. ముఖ్యంగా ఈ కేంద్రాలను ఐబీఎం, డెల్ వంటి కీలకమైన మైక్రోసాఫ్ట్ కస్టమర్లు, ప్రభుత్వ రంగ సంస్థలు టెక్నాలజీ ఇంటిగ్రేషన్, ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం ఉపయోగిస్తున్నాయని తెలిపారు. ఐబీఎం-మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ జోన్ ప్రత్యేకంగా క్లయింట్‌లకు అజ్యూర్, కోపైలట్ వంటి సాంకేతికతలను ఉపయోగించి ఏఐ ఆధారిత వ్యాపార పరిష్కారాలను చూపడంలో సహకరిస్తుందని చెప్పారు. అనంతరం ఎక్స్‌పీరియన్స్ సెంటర్ చాంబర్ లో మైక్రోసాఫ్ట్ గవర్నమెంట్ ఎఫైర్స్ హెడ్ మార్కస్ లోహ్, లీగల్ అఫైర్స్ హెడ్ జాస్మిన్ బేగం, సీటీఓ మార్క్ సౌజాలతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు.

**- క్వాంటమ్ వ్యాలీలో హ్యాకథాన్ నిర్వహించండి**

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... జనరేటివ్ ఏఐ ఆధారిత పరిష్కారాలను కనుగొని సమన్వయం చేయడానికి ఏపీలో మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ జోన్/టెక్నాలజీ స్టేషన్ ను ఏర్పాటు చేయాలని కోరారు. భారతదేశంలోని అతిపెద్ద నైపుణ్యం కలిగిన ఐటీ నిపుణుల సమూహాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి, అమెరికాలోని భారతీయ ఐటీ శ్రామిక శక్తిలో 25 శాతం కంటే ఎక్కువ మంది తెలుగు సమాజం నుండి వచ్చారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్‌లో అజ్యూర్ ఓపెన్‌ఏఐ సర్వీస్, మైక్రోసాఫ్ట్ కోపైలట్‌ను ఉపయోగించి పరిష్కారాలను అన్వేషించడానికి మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఆధ్వర్యాన 2026లో హ్యాకథాన్‌ను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. మైక్రోసాఫ్ట్ ఎక్స్ పీరియన్స్ సెంటర్ భాగస్వామ్యంతో జనరేటివ్ ఏఐ, హైబ్రిడ్ క్లౌడ్, మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులలో నైపుణ్యం కలిగిన ఐటీ వర్క్‌ఫోర్స్‌ను అభివృద్ధి చేయడానికి ఏపిలోని టాలెంట్ పల్ ను ఉపయోగించుకోవాలని సూచించారు.

**- ఇన్ఫినియన్ సెమీకండక్టర్స్ యూనిట్ సందర్శన**

అనంతరం మంత్రి లోకేష్ బృందం ఇన్ఫినియన్ సెమీ కండక్టర్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను సందర్శించింది. ఈ సందర్భంగా ఇన్ఫియన్ ప్రెసిడెంట్ ఎండి సిఎస్ చువాతో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఏపిలో ఈఎంసిలు లేదా పారిశ్రామిక పార్కులలో సెమీ కండక్టర్స్ తయారీ (బ్యాక్ ఎండ్/ అసెంబ్లింగ్, టెస్టింగ్)కి అనుబంధంగా ప్యాకేజింగ్, టెస్టింగ్ యూనిట్ ను ఏర్పాటు చేయాలని కోరారు. పవర్ మాడ్యూల్స్, ఇన్వర్టర్లు, బీఎంఎస్ వ్యవస్థలను రూపొందించడానికి స్థానిక ఈవీ పర్యావరణ వ్యవస్థ ప్రధాన సంస్థలతో భాగస్వామ్యం వహించాలని సూచించారు. ఇంజనీర్లు, టెక్నీషియన్ల శిక్షణ కోసం సెమీ కండక్టర్ స్కిల్ అకాడమీ ఏర్పాటుచేయ్యడానికి ఏపి స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ కు సహకారం అందించాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తిచేశారు.

# తప్పు చేస్తే జగన్ అరెస్ట్ కావడం ఖాయం



అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చిట్ చాట్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాయలసీమలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు రాబోతున్నాయన్నారు. టమోటాకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ సైతం రాయలసీమకు రానుందని చెప్పారు. రాయదుర్గంలో సాగయ్యే వంకాయకు రుచి బాగా ఉంటుందన్నారు. అలాగా టమోటా రైతులు కూడా విభిన్నంగా పండించేందుకు ట్రై చేయాలని చెప్పారు. రెండో పంట వరి వేయకుండా వేరే పంట వేస్తే రైతులకు మేలు జరిగే అవకాశముందన్నారు. అయితే అనంతపురంలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ రావడం మంచి పరిణామమని పేర్కొన్నారు. క్వినోవా మంచి రేటు ఉండడంతో కొంత మంది క్వినోవా వేస్తున్నారు. కానీ మన దగ్గర అది పనికి రాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అభిప్రాయపడ్డారు. చిత్తూరు పాడి రైతులకు మంచి ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కొంత మంది పాడి పరిశ్రమని శాసిస్తున్నారని ఆరోపించారు. ఇక బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతాల్లో గొడవలు రావడమనేది సహజమన్నారు. తెలుగుదేశం పార్టీతో తమకు సహజ సిద్ధమైన పొత్తు ఉందని గుర్తు చేశారు. మరోవైపు ఇక్కడి ప్రజలు రెండు మైండ్ సెట్లతో ఉన్నారన్నారు. వారి మైండ్ సెట్ మార్చాల్సిన అవసరం అయితే లేదని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ ఇటీవల ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆయన పర్యటిస్తున్నారు. ఆ క్రమంలో ప్రస్తుతం ఆయన రాయలసీమలో పర్యటిస్తున్నారు. మంగళవారం కర్నూలు జిల్లాలో ఆయన పర్యటించారు. మద్యం కుంభకోణం కేసులో వైఎస్ జగన్ అరెస్ట్ తప్పదని ఆయన స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

# జగన్ పర్యటన ముగిశాక కాకాణి దుర్మార్గాలు బయటపెడతా

- జైల్లో ఉన్న కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శించనున్న వైనం
- జగన్ మాట విని ఎంతమంది జైలు పాలయ్యారన్న సోమిరెడ్డి
- వారిని కూడా జగన్ పరామర్శించాలని డిమాండ్

మన గళం డెస్క్ : వైసీపీ అధినేత జగన్ రేపు నెల్లూరు పర్యటనకు వస్తుండడంపై టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పందించారు. జగన్ ఏ ముఖం పెట్టుకుని నెల్లూరు వస్తున్నారని నిలదీశారు. జగన్ మాట విని ఎంతోమంది అధికారులు ఊచలు లెక్కపెట్టారని, జగన్ వారిని పరామర్శించకుండా, కాకాణిని పరామర్శించేందుకు నెల్లూరుకు ఎందుకు వస్తున్నట్టు అని ప్రశ్నించారు. లిక్కర్ స్కాంలో జైలుకు వెళ్లిన మిథున్ రెడ్డి, రాజ్ కెసిరెడ్డి, ధనంజయరెడ్డిలను కూడా జగన్ పరామర్శించాలని అన్నారు. “కాకాణి అక్రమాలతో ఎంతోమంది



అధికారులు సస్పెన్షన్ వేటుకు గురయ్యారు... అప్పట్లో వైసీపీ ఎంపీగా ఉన్న మాగుంట శ్రీనివాసుల రెడ్డి సంతకాన్ని కూడా ఫోర్జరీ చేశారు... రేపు జగన్ పర్యటన ముగియగానే కాకాణి దుర్మార్గాలన్నీ బయటపెడతా” అని హెచ్చరించారు. కాకాణి పాపాలకు బలైన వారిని కూడా జగన్ పరామర్శించాలని సోమిరెడ్డి స్పష్టం చేశారు.

# శ్రీవాణి టికెట్లపై టీటీడీ కీలక నిర్ణయం!




మన గళం, తిరుమల : తిరుమలలో వసతి సమస్యను అధిగమించేందుకు టీటీడీ ఎన్నో ప్రయత్నాలు చేస్తోంది. భక్తులకు వసతి ఇబ్బందులు రాకుండా ఎన్నో చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే కొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకుంటుంది. శ్రీవాణి దర్శన సమయంలో మార్పులు చేస్తూ ఈ మేరకు టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమల శ్రీవారిని శ్రీవాణి టికెట్లను కొనుగోలు చేసి స్వామి వారి దర్శనం చేసుకునే భక్తులకు వసతి సమస్య రాకుండా ప్రయత్నిస్తోంది. శ్రీవాణి దర్శన సమయాల్లో మార్పు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఉదయం 10 గంటలకు ఉన్న దర్శన సమయాన్ని సాయంత్రం 4.30 గంటలకు మార్పు చేసింది. ఏ రోజుకు ఆ రోజు శ్రీవాణి దర్శన టికెట్ల జారీ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఆఫ్ లైన్‌లో శ్రీవాణి దర్శన టికెట్లు పొందే భక్తులకు అదే రోజు దర్శనం కల్పించనుంది. తిరుమలలో దర్శన సమయాల్లో మార్పులు చేస్తున్నట్లు ప్రకటించింది. తిరుమలలోని గోకులం గెస్ట్ హౌస్ లో అధికారులతో సమావేశం నిర్వహించిన టిటిడి అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తిరుమలలో వసతి గృహాలపై భారం తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్న టిటిడి.. ఆగస్టు 1 నుంచి నూతన విధానం అమలు చేయనుంది. తిరుమలలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీవాణి టికెట్లను జారీ చేయనుంది. రేణిగుంట విమానాశ్రయంలో ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు దర్శన టికెట్లు జారీ చేయనుంది. తిరుమలలో ఆఫ్ లైన్ ద్వారా 800 టికెట్లు, రేణిగుంట విమానాశ్రయంలో 200 టికెట్లు జారీ చేస్తున్న టీటీడీ ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ ద్వారా ఆక్టోబర్ 31 వరకు ఆన్ లైన్ లో శ్రీవాణి టికెట్లను పొందిన భక్తులకు మాత్రం యథావిధిగానే ఉదయం 10 గంటలకే దర్శనానికి అనుమతించాలని నిర్ణయం తీసుకుంది. నవంబర్ 1వ నుండి ఆఫ్ లైన్, ఆన్ లైన్ శ్రీవాణి టికెట్లను పొందిన భక్తులకు తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద సాయంత్రం 4.30 లకు రిపోర్టింగ్ సమయం కేటాయిస్తోంది. శ్రీవాణి టికెట్ ల ద్వారా టిటిడి కి రోజు రూ. కోటిన్నర ఆదాయం వస్తుండగా ఏటా దాదాపు రూ. 500 కోట్లు వస్తోంది. శ్రీవాణి దర్శన సమయంలో మార్పు పై తీసుకున్న నూతన విధానం ఆగస్టు ఒకటి నుంచి 15 వరకు ప్రయోగాత్మకంగా అమలు చేయాలని టిటిడి భావిస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం వల్ల శ్రీవాణి టికెట్ దర్శనం కోసం భక్తులకు సుమారుగా 3 రోజుల సమయం పడుతున్నట్లు టీటీడీ గుర్తించింది. దీంతో వసతిఇబ్బంది, సమయం వృధా కాకుండా ఉండేందుకు కొత్త ఆలోచనకు టీటీడీ శ్రీకారం చుట్టినట్టు తెలుస్తోంది. నూతన విధానం తో భక్తులకు త్వరగా శ్రీవారి దర్శనం చేసుకునే వెసులుబాటు కలుగుతోందని భావిస్తోంది.

## సీఎం రేవంత్‌తో మీనాక్షి నటరాజన్, మహేష్‌గౌడ్ భేటీ

# కీలక అంశాలపై చర్చ

మన గళం, హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో టీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇవాళ(బుధవారం జులై 30) భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించారు. పార్టీ నిర్మాణం, పాదయాత్ర, బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో పోరాట కార్యాచరణపై మాట్లాడారు. దాదాపు గంటన్నరపాటు సుదీర్ఘంగా చర్చించారు. ఈ నెల(జులై) 31వ తేదీ నుంచి వచ్చే నెల (ఆగస్టు) 4వ తేదీ వరకు యథావిధిగా కాంగ్రెస్ పాదయాత్ర చేపట్టనుంది. ఆగస్టు 5,6,7 మూడురోజుల పాటు 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదానికై ఢిల్లీలో కార్యాచరణ రూపొందించారు. ఆగస్టు 5వ తేదీన పార్లమెంటు ఉభయ సభల్లో ఎంపీల వాయిదా తీర్మానం, చర్చకు పట్టుబట్టే అవకాశం ఉంది. ఆగస్టు 6న జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకత్వం, బీసీ సంఘాల నాయకులు పాల్గొననున్నారు.



ఆగస్టు 7న రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రత్యేక రైలులో ప్రతీ నియోజకవర్గం నుంచి 50 మంది కాంగ్రెస్ శ్రేణులు ఢిల్లీకి వెళ్లాలని నిర్ణయించారు. ఢిల్లీ పర్యటన అనంతరం తెలంగాణలో యథావిధిగా కాంగ్రెస్ పాదయాత్ర కొనసాగనుంది.

## ఆహార పదార్థాలు శుభ్రంగా ఉండాలి

– పాత బస్ స్టాండ్ లోని అన్న క్యాంటీన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

మనగళం, కర్నూలు సిటీ : అన్న క్యాంటీన్లలో ఆహార పదార్థాలు శుభ్రంగా, వేడిగా, రుచిగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక పాత బస్ స్టాండ్ లో ఉన్న అన్న క్యాంటీన్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్న క్యాంటీన్ లో భోజనం చేస్తున్న వారితో మాట్లాడారు. ప్రతి రోజు భోజనం ఇక్కడే చేస్తారా?? భోజనం ఏ విధంగా ఉంది?? అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఇక్కడే భోజనం చేస్తామని, భోజనం నాణ్యతగా, రుచిగా ఉంటుందని కలెక్టర్ కి తెలిపారు. ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయంలో ఎంతమంది భోజనం చేస్తున్నారని సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. బయట కింద కూర్చొని భోజనం చేస్తున్న వారి కొరకు టేబుల్ లను ఏర్పాటు చేయించాలని కలెక్టర్..... కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా అన్న క్యాంటీన్ పరిసరాలలో పూలు అమ్ముకునే వారితో కూడా మాట్లాడారు. పూలు ఎక్కడి నుంచి తీసుకొచ్చి అమ్ముతారు? ప్రతిరోజు అన్న క్యాంటీన్లో భోజనం చేస్తారా? భోజనం రుచి ఏ విధంగా ఉంది ? ఏమైనా పెన్షన్ వస్తుందా ? అని కలెక్టర్ వారిని ఆరా తీశారు. పూలు బెంగళూరు నుండి తీసుకొచ్చి అమ్ముతామని, ప్రతిరోజు అన్న క్యాంటీన్లో భోజనం చేస్తామని, భోజనం చాలా రుచిగా ఉంటుందని కలెక్టర్ కు వారు తెలిపారు. అర్హత ఉండి పెన్షన్ ఎవరికైనా రాకపోతే వెంటనే దరఖాస్తు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. కలెక్టర్ పూల మార్కెట్ ను పరిశీలిస్తూ ఇక్కడ మొత్తం ఎన్ని షాప్ లు ఉన్నాయి?? మున్సిపాలిటీ వారు పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు ఏ విధంగా చేస్తున్నారు?? అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు..



## పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలి

మనగళం, కర్నూలు సిటీ: నగర పరిధిలోని 32 వ వార్డు ముజాఫర్ నగర్ లో ఉన్నటువంటి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం సీపీఎం ప్రతినిధి బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె సుధాకరప్ప ,నగర కమిటీ సభ్యులు యస్ హుస్సేన్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాల తరహాలో ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేస్తామని నాలుగు రంగులు వేసి రంగుల ప్రపంచం చూపించడం తప్పా చేసిందేమీ లేదని విమర్శించారు. ముజాఫర్ నగర్ హైస్కూల్లో 500 మంది విద్యార్థులకు తగ్గట్లు టాయిలెట్స్ లేక విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్యాన్లు సరిగ్గా పనిచేయడం లేదని, పాఠాలు చెప్పే డిజిటల్ బోర్డుకు సరైన నెట్వర్క్ సౌకర్యం లేదన్నారు. ప్రధానంగా ఇంగ్లీష్, హిస్టరీ సబ్జెక్టులకు సంబంధించి టెన్త్ క్లాస్ విద్యార్థులకు పూర్తిస్థాయిలో బుక్స్ అందలేదన్నారు. కార్యక్రమంలో స్థానిక సీపీఎం కార్యకర్తలు కె సురేష్, ముని స్వామి, జె రాజు, యం మహేష్ పాల్గొన్నారు.




## ఆగస్టు 2న నగరపాలక సర్వసభ్య సమావేశం

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : ఆగస్టు 2న నగరపాలక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, మేయర్ బి.వై. రామయ్య, మంత్రి టీజీ భరత్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరితరెడ్డి, బొగ్గుల దస్తగిరి, డిప్యూటీ మేయర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో 19 అంశాల అజెండాపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని కమిషనర్ వెల్లడించారు.

## త్వరలో నగరపాలక మరో పెట్రోల్ పంప్




మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగర పరిధిలోని 19వ వార్డు జొహరపురం రోడ్డున నగరపాలక సంస్థ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్ పనులు దాదాపు పూర్తి అయ్యాయని , వచ్చే వారంలో పంప్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. బుధవారం ఆయన పెట్రోల్ పంప్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే బుధవారపేటలో వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. బుధవారపేట దామోదరం సంజీవయ్య పార్కులో సౌకర్యాలపై స్థానికులను ఆరా తీశారు. నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, డీఈఈ నరేష్, ఏఈ జనార్ధన్, పారిశుధ్య తనిఖీదారులు రమేష్, హుస్సేన్, మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు

## సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్లు విడుదల




మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు నగరంలో ఆగస్టు 9,10,11, తేదీల్లో జరిగే సీపీఐ కర్నూలు జిల్లా 24 వ మహాసభల వాల్ పోస్టర్లను బుధవారం స్థానిక సీఆర్ భవన్ నందు మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షులు కె జగన్నాథం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగన్నాథం, మునెప్ప మాట్లాడుతూ నిత్యం పేద మధ్యతరగతి ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించడమే కాకుండా కూడు గూడు లేని నిరుపేదల కోసం దున్నేవాడికే భూమి కావాలని సమరశీల పోరాటాలు నిర్వహించామన్నారు. లక్షల ఎకరాల సాగు భూమిని పేద ప్రజలకు పంచడమే కాకుండా ఇండ్లు లేని పేద ప్రజలకు ఇండ్ల స్థలాలు ఇచ్చిన చరిత్ర సీపీఐకి ఉందని గుర్తు చేశారు. అలాంటి సిపిఐ కర్నూలు జిల్లా 24వ మహాసభలు నగరంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, ప్రతిఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ కర్నూల్ నగర సహాయ కార్యదర్సులు జి చంద్రశేఖర్ సి మహేష్, నగర కార్యవర్గ సభ్యులు వెంకటేష్, బీసన్న, కుమారు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య, నగర కార్యదర్శి భారతి తదితరులు పాల్గొన్నారు.

## ఆది కర్మయోగి అభియాన్ ను సమర్థవంతంగా అమలు చేయాలి




– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : గిరిజనుల అభివృద్ధికి ఆది కర్మయోగి అభియాన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. జబుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో ఆది కర్మయోగి అభియాన్ పథకం అమలుపై వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గిరిజనులు,సంచార జాతుల వారి అభ్యున్నతి కోసం ఆది కర్మయోగి అభియాన్ పథకాన్ని అమలు చేయడం జరుగుతోందన్నారు. మన జిల్లాలో 35 వేల మంది గిరిజనులు ఉన్నారని, వీరికి అన్ని పథకాలు, సేవలు సంతృప్త స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, రోడ్లు, త్రాగునీరు,అటవీ, గృహాలు,మహిళా శిశు సంక్షేమం అంశాలకు సంబంధించి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వీటితో పాటు సర్వీస్ డెలివరీ కి సంబంధించి ఆధార్ లేనివారికి ఆధార్ క్యాస్ట్ సర్టిఫికెట్ ఇప్పించడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించడం, పెన్షన్లు, అవసరం మేరకు లోన్ సౌకర్యం, ఇతర జీవనోపాదులు కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను పూర్తి చేయాలి : జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఎంపీడీఓ లను ఆదేశించారు. పేద కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చే వారిని గుర్తించి మార్గదర్శులు గా రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్/ డీటీడబ్ల్యూఓ కొండయ్య, సీపీఓ హిమ ప్రభాకర్ రాజు, డీడబ్ల్యూఎంఏ పీడీ రమణయ్య, డీఈఓ శామ్యూల్ పాల్, ఆర్ అండ్ బీ ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, ఐసిడిఎస్ పీడీ నిర్మల, అగ్రికల్చర్ జేడీ వరలక్ష్మి, పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాసులు, పీఆర్ ఈఈ మద్దన్న, డీపీఓ భాస్కర్, ఎల్డీఎం రామచంద్ర రావు, ఏపీ ఎస్పీడీసీఎల్ ఈఈ ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 11న జిల్లాస్థాయి యోగా టోర్నమెంట్ సెలక్షన్

మనగళం, కర్నూలు సిటీ : ఆగస్టు 11 వ తేదీన కర్నూలు జిల్లా స్థాయి యోగా టోర్నమెంట్ కమ్ సెలక్షన్ ను కర్నూలు లోని అవుట్డోర్ స్టేడియం ఉన్న యోగ హాల్ నందు నిర్వహిస్తున్నట్లు కర్నూలు యోగ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అవినాష్ శెట్టి, ముని స్వాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలను 8-10,10-12,12-14, 14-16,16-18,18-21, 21-25,25-30,30-35, 35-45,45 సంవత్సరాల పైబడిన వారికి బాల బాలికల స్త్రీ,పురుషుల విభాగంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు చివరి వారంలో వెస్ట్ గోదావరి జిల్లా వేదికగా జరగబోయే 50వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, సీనియర్ బాలబాలికల విభాగంలో కర్నూలు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 7732089440 ఫోన్ నెంబర్ కు సంప్రదించాలని సూచించారు.

## 2న అన్నదాత సుఖీభవ, పీయం కిసాన్ నిధులు జమ

–పెండింగ్ లో ఉన్న ఈ-కేవైసీ త్వరగా పూర్తి చేయాలి – జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ఆగస్టు 2 వ తేదీన అన్నదాత సుఖీభవ-పియం కిసాన్ నిధులు జమ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, జిల్లాలో అర్హులైన రైతులందరికీ నిధులు జమ చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం నిధులు జమ చేసే అంశం పై వ్యవసాయ శాఖ అధికారులతో, తహసీల్దార్ లతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా మొత్తం మీద 2 లక్షల 75 వేల 749 మంది రైతులకు గాను 2 వేల 107 మంది రైతులకు ఈ-కేవైసీ పెండింగ్ ఉందని, వీరికి వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్పీసీఐ మ్యాపింగ్ కాని రైతులు 8 వేల 755 మంది ఉన్నారని, ఇందులో ఆదోని, దేవనకొండ, కృష్ణగిరి, కౌతాళం మండలాల్లో ఎన్పిసిఐ మ్యాప్ కానివి చాలా ఎక్కువ సంఖ్యలో పెండింగ్ లో ఉన్నాయన్నారు. వెంటనే మ్యాపింగ్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓ లు ఈ అంశం పై ప్రత్యేక దృష్టి సారించి వీటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి ఈ-కేవైసీ, మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. టెలికాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య,




ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఎల్డీఎం రామచంద్ర రావు, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా నాగమధు యాదవ్



మనగళం, కర్నూలు సిటీ : యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా నాగమధు యాదవ్ ను ఆ పార్టీ అధిష్టానం నియమించినది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. నా మీద నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన యువ నాయకులు రాహుల్ గాంధీ, ఏఐసీపీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్ తదితర పెద్దలకు ఈ సందర్భంగా నాగమధు యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. నాగమధు యాదవ్ కు ఎన్ఎస్ యూఐ విద్యార్థి సంఘాల నాయకులు శ్రీనివాస్, సాయి కుమార్ యాదవ్ ,ధోని రాజు, మహేష్, విజయ్, నూర్ భాషా, రవి సుబ్బయ్య, జంబులయ్య, నవీన్, ప్రకాష్, తదితరులు అభినందనలు తెలియజేశారు.

## బంగారుపేట పిల్లలకు ఆధార్ కార్డులు

మనగళం, కర్నూలు సిటీ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా జడ్జి జి. కబర్ధి ఆదేశాల మేరకు జిల్లా న్యాయవాదికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బంగారుపేట సచివాలయంలో స్పెషల్ ఆధార్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల, జిల్లా సచివాలయం ఆధార్ ఇన్చార్జి శంకర్ రెడ్డి బృందం సహకారంతో బంగారు పేటలోని పిల్లలకు ఆధార్ కార్డులను జారీ చేయడం జరిగింది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



# ప్రభుత్వ పథకాల పేరిట సైబర్ నేరగాళ్ల మోసాలు

- సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి
- పథకాల పేరుతో వచ్చే తెలియని లింకులను క్లిక్ చేయవద్దు
- బ్యాంకు ఖాతాల ఓటీపీలు చెబితే మోసపోతారు... జాగ్రత్త
- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



మనగళం, కర్నూలు క్రైం : ప్రభుత్వ పథకాలైన పీఎం కిసాన్, ముద్ర లోన్స్, సూర్యఘర్, అమ్మవడి వంటి పథకాల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం తెలిపారు. 'ఇది ప్రభుత్వం ప్రారంభించిన కొత్త పథకం. ఇప్పుడే దరఖాస్తు చేసుకోండి. మీకు రూ.50 వేల రాయితీ' అంటూ ఆకర్షించి ఖాతాలను సైబర్ నేరగాళ్లు కొల్లగొడుతున్నారని అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారిని ఎంచుకొని మోసాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆయా పథకాల పేరుతో మొబైల్ కు వచ్చే తెలియని లింకులను క్లిక్ చేయవద్దన్నారు. ఓటీపీలు చెబితే మోసపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. అపరిచిత లింకులను నమ్మవద్దని సూచిన్చరు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన దరఖాస్తుల కోసం అధికారిక వెబ్‌సైట్‌లను మాత్రమే ఉపయోగించాలన్నారు. వ్యక్తిగత సమాచారం షేర్ చేయవద్దని, బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దని జిల్లా ఎస్పీ సూచించారు.

# యూరియా పంపిణీ లో సమస్యలు లేకుండా చూడాలి

**- జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా**

మనగళం, కర్నూలు సిటీ : యూరియా పంపిణీ లో సమస్యలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని క్యాంపు కార్యాలయం నుండి పి 4 పాలసీ, తల్లికి వందనం, హౌసింగ్, ఉపాధి హామీ, తాగు నీరు, పిజిఆర్ఎస్, యూరియా లభ్యత తదితర అంశాలపై మండల స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం 563 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని, ఆగస్టు 1 వ తేదీన 2 వేల 500 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందన్నారు. సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు తరచూ ప్రతి షాపు ను తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా పీజీఆర్ ఎస్ ద్వారా వచ్చిన సమస్యలను నాణ్యతతో గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇళ్ళ నిర్మాణాలు పూర్తయ్యేలా నిరంతర కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు. పైప్ లైన్ సమస్యలు ఎక్కడైనా ఉంటే మరమ్మతుల కొరకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ప్రతికూల వార్తలకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకున్నారని కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఒకవేళ బడ్జెట్ సమస్య ఏమైనా ఉంటే తన దృష్టికి తేవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీలకు పని దినాలు కల్పించడంలో ఇప్పటివరకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించామని, అయితే రానున్న కాలంలో లక్ష్యాలు ఇంకా పెరిగే అవకాశం ఉన్నందున లక్ష్యానికి మించి పనులు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ కి సంబంధించి మిగిలిన వాటికి అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ లు వెంటనే తీసుకోవాలని కలెక్టర్ డ్వామా పీడీని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య మాట్లాడుతూ నీటి పన్ను కు సంబంధించి డేటా ఎంట్రీ పూర్తిచేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, డీఎఫ్ఓ శ్యామల, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ నాగేశ్వర రావు, డీపీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీల భారాలపై పోరాడాలి

మనగళం, కర్నూలు సిటీ : విద్యుత్ చార్జీల భారం మోపేందుకు ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెట్టడానికి వ్యతిరేకంగా పోరాడడమే కామ్రేడ్ బి కృష్ణకు నిజమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. రాముడు అన్నారు. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 43వ వార్డు ఇందిరా గాంధీ నగర్ లో ఉన్న యువజన సంఘం కార్యాలయంలో బుధవారం కామ్రేడ్ బి. కృష్ణ 14వ వర్ధంతి సభ నాయకులు ఎస్ .రోశయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా కృష్ణ చిత్రపటానికి నాయకులు, కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000లో ఆనాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చి ప్రజలపై విద్యుత్ చార్జీలా భారాన్ని వేయడాన్ని సీపీఎం వ్యతిరేకించిందని గుర్తు చేశారు. ఇందులో భాగంగా చేపట్టిన ఛలో అసెంబ్లీ సందర్భంగా బషీర్ బాగ్ లో జరిగిన పోలీసు కాల్పులలో కృష్ణ వీరోచితంగా పోరాడరన్నారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు వి. శంకర్, కె .విక్రమ్, ఎస్. మైదుకూరు హుస్సేన్, బి. అలివేలు, జమున. భాగ్యమ్మ, కృష్ణవేణి. నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



# డీఐజీని కలిసిన బీజేపీ నాయకులు

మనగళం, కర్నూలు సిటీ : డీఐజీ కోయ ప్రవీణ్ ను బుధవారం కర్నూలు జిల్లా బీజేపీ అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఐజీకి శాలువా కప్పి సత్కరించారు.

# ప్రజలు సంతోషంగా ఉన్నారు




- సంక్షేమ పథకాల అమలును అభినందిస్తున్నారు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి

మనగళం, కర్నూలు సిటీ : కూటమి సర్కార్ పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరును ప్రతిఒక్కరూ అభినందిస్తున్నారని చెప్పారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం సీనియర్ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆకెపోగు ప్రభాకర్, కేవీ సుబ్బారెడ్డి, కేయీ జగదీష్, ముంతాజ్ తో కలిసి ఏర్పాటు చేసిన పత్రికా, మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 2వ తేదీన ప్రారంభమైన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం కర్నూలు జిల్లాలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు తమ తమ పరిధిలో హాజరై విజయవంతం చేశారన్నారు. టీడీపీ నాయకులు ప్రజలను ఇంటింటికి వెళ్లి కలుసుకొని గడిచిన సంవత్సర కాలంలో సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేపట్టినటువంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఏమేరకు ప్రజలకు అందాయో తెలుసుకున్నారన్నారు. అలాగే ప్రజల సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు వాటిని ఆన్ లైన్ లో పొందుపర్చడం జరిగిందని వివరించారు. అదేవిధంగా ప్రజల సమస్యలను అధికారులకు వివరించి పరిష్కార చర్యలు తీసుకున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ అరాచక పాలనకొనసాగించడమేకాక, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి వెళ్లారని విమర్శించారు. అలాంటి పరిస్థితుల నుండి సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని గాడిలో పెట్టి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నారని గుర్తు చేశారు. సామాజిక పెన్షన్ల పెంపు, అన్యాక్రాంతమైన భూములను కాపాడేందుకు జి.ఓ. నెం.1 రద్దు, అన్నా క్యాంటీన్ల పునః ప్రారంభం, 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, మెగా డీఎస్సీ , ఉచిత ఇసుక విధానం అమలు, తల్లికి వందనం తదితర హామీలు అమలు చేశామని గుర్తు చేశారు. త్వరలో రైతులకు అండగా అన్నదాత సుఖీభవ నగదు అందుతుందని, ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం అవుతుందని వివరించారు. అదేవిధంగా గత 2014-2019లో పేదలకోసం నిర్మించిన 10 వేల టిడ్కో గృహాలను త్వరలోనే లబ్దిదారులకు అందజేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు నంది మధు, పి.రవికుమార్, సత్రం రామక్రిష్ణుడు, డి. జేమ్స్, పుల్లయ్య చౌదరి, రామచంద్రనాయుడు, రాజశేఖర్, బేత క్రిష్ణుడు, హనుమంతరావుచౌదరి, యస్. షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా భద్రతను ఏర్పాటు చేసుకోవాలి




- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

మనగళం, కర్నూలు క్రైం : నేర నివారణే ప్రథమ లక్ష్యంగా అన్ని బ్యాంకులు పకడ్బందీగా భద్రతను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. బ్యాంకుల భద్రతా ప్రమాణాల పై జిల్లా ఎస్పీ జిల్లాలోని అన్ని బ్యాంకుల మేనేజర్లతో బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఇటీవల మధ్యప్రదేశ్, మహరాష్ట్ర, తమిళనాడు, హర్యానా తదితర రాష్ట్రాలలో హైవే ప్రక్కన ఉన్న బ్యాంకుల్లో జరిగిన దొంగతనాలను గుర్తు చేశారు. అలాంటి సంఘటనలు జిల్లాలో జరగకుండా బ్యాంకు అధికారులు పకడ్బందీగా భద్రతను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్యాంకు లోపల, బయట అన్ని ప్రదేశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజా భద్రత చట్టం ప్రకారం మన్నిక కలిగిన సెన్సార్ సీసీ కెమెరాలు , బ్యాంకులలో దొంగలు పడిన వెంటనే అత్యవసర పరిస్థితుల్లో సెక్యూరిటీ అలారం మోగే విధంగా అందరూ అప్రమత్తం అయి బ్యాంకు వారికి మెసెజ్లు, అలర్ట్స్ వచ్చే విధంగా భద్రతను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి బ్యాంకులో సెక్యూరిటీ గార్డులు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. లారీ డ్రైవర్స్ లారీలలో కార్లను డెలివరీ చేసేందుకు వచ్చి ఇతర రాష్ట్రాల నుండి వచ్చి దొంగలు దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. సెలవు రోజులలో రెక్కి చేస్తారన్నారు. కొందరి ఖాతాదారుల ఖాతాలలో అతి పెద్ద మొత్తాలలో లావాదేవీలు జరిగినప్పుడు బ్యాంకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరగాళ్ల గురించి ఖాతా దారులను అప్రమత్తం చేయాలన్నారు. ఓటీపీ ఫ్రాడ్స్, ఎపికె ఫైల్స్, డిజిటల్ ఫ్రాడ్స్, ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్స్ గురించి ఖాతాదారులకు బ్యాంకులలో హెచ్చరిస్తూ సైబర్ మోసాల గురించి తెలియజేస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాలన్నారు. కార్యక్రమంలో కర్నూల్ డీస్పీ జె. బాబు ప్రసాద్, ఎస్బీఐ మేనేజర్ అబ్దుల్ రావూఫ్ , కరూర్ వైశ్య బ్యాంక్ పీరయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ తేజమూర్తి , కర్నూలు పట్టణ సీఐలు రామయ్య నాయుడు, నాగరాజా రావు, శ్రీధర్, విక్రమ్ సింహా, చంద్రబాబు నాయుడు, మన్సురుద్దీన్ , నాగశేఖర్ , సైబర్ ల్యాబ్ సిఐ వేణుగోపాల్ , ఎస్సైలు, సైబర్ ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

# డప్పు కళాకారులకు పెన్షన్ ఆన్ లైన్ విడుదల చేసి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

మన గళం గూడూరు: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం లోని గూడూరు పట్టణంలో డప్పు కళాకారుల సమస్యలు వెంటనే పరిష్కరించి,డప్పు కళాకారుల పెన్షన్ ఆన్లైన్ ను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్, మండల గౌరవ అధ్యక్షులు జే,మోహన్ లు డిమాండ్ చేశారు. సోమవారం గూడూరు మండల కేంద్రంలోని సిఐటియు మండల కార్యాలయంలో డప్పు కళాకారుల సమావేశం సంఘం మండల కార్యదర్శి బూడిదిపాడు నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి బి. కరుణాకర్, గూడూరు డప్పు కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షులు జే, మోహన్ లు పాల్గొన్నారు ఈసమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం రోజులు పూర్తి చేసుకున్నా నేటికి డప్పు కళాకారుల పెన్షన్ ఆన్లైన్ ను విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. వెంటనే పెన్షన్ ఆన్లైన్ ను విడుదల చేయడంతో పాటు పెన్షన్ నమోదు వయసును 45 సంవత్సరాలకు తగ్గించాలన్నారు. తరతరాలుగా అంటరానితనాన్ని అవమానాన్ని భరిస్తూ సమాజమంతటికి ఉపయోగపడే సాంప్రదాయకళగా ఉన్న డప్పు కళ పెన్షన్ ను 7 వేలకు పెంచాలన్నారు. అలాగే మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణం చేపట్టాలని అలాగే ప్రతి డప్పు కళాకారునికి అర్హులైన ప్రతి డప్పు కళాకారునికి డప్పు గజ్జలు డ్రస్సు ప్రభుత్వమే ఇవ్వాలని, అలాగే డప్పు కళాకారులకు ఆరోగ్య భీమా వర్తింపజేయాలని, బస్సు ప్రయాణాల్లో రాయతీలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్చార్జి ఎంపీడీవో మధులత సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేస్తూ డప్పు కళాకారుల సమస్యలు వారికి వివరించి చెప్పారు వారి సమస్యలు విన్న ఇన్చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కార దిశగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మరో దఫా ఆగస్టు 5న జరిగే మండల డప్పు కళాకారుల జనరల్ బాడీ సమావేశానికి డప్పు కళాకారులంతా అత్యధిక సంఖ్యలో హాజరై డిమాండ్ల సాధనలో భాగస్వామ్యం కావాలని వారు పిలుపునిచ్చారు ఈ

సమావేశంలో డప్పు కళాకారుల సంఘం మండల నాయకులు భగవంతు,గూడూరు ఏసేపు, తిమ్మప్ప, గుడిపాడు నాగరాజు, వెంకటేశ్వర్లు, సనగండ్ల శేషన్న, బుడ్డన్న, రత్నమయ్య, జూలకల్లు ప్రభుదాసు, ప్రకాశం, బూడిదపాడు సురేష్, గుడిపాడు సుధాకర్ వీరితోపాటు మరో 20 మంది డప్పు కళాకారులు పాల్గొన్నారు




## మంత్రులను కలిసిన దేవాదాయ శాఖ అధికారులు, పురోహితులు



మనగళం, బనగానపల్లె : రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర రోడ్లు,భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని ప్రముఖ పుణ్యక్షేత్రాలు మంత్రాలయం, యాగంటి, నందవరం తదితర ఆలయాల దేవాదాయ శాఖ అధికారులు, పురోహితులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బనగానపల్లెలోని మంత్రి బీసీ స్వగృహంలో మంత్రులకు అధికారులు, పురోహితులు ఆయా దేవాలయాల తీర్థప్రసాదాలు, దేవుని ప్రతిమలు అందజేశారు. వేద ఆశీర్వచనం చేశారు. ఆలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు ఈ సందర్భంగా వివరించారు.



## 7.50 కోట్ల తో నరసింహస్వామి పున: నిర్మించిన రాంకో సిమెంట్ యాజమాన్యం.





– నరసింహస్వామి ఆలయ కుంబాభిషేకంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు.

మన గళం కొలిమిగుండ్ల : నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పున: నిర్మాణం చేపట్టిన రాంకో సిమెంట్ యాజమాన్యం . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చేతుల మీదుగా ఏడున్నర కోట్లతో శ్రీ లక్ష్మీనరసింహస్వామి పునర్నిర్మాణం శిలాఫలకం ప్రారంభించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకున్న ఆలయాన్ని రాంకో సిమెంట్ వారు పున: నిర్మాణం చేపట్టడం ఎంతో సంతోషదాయకమన్నారు. కొలిమిగుండ్ల చుట్టుపక్కల వారు పాడి పంటలు తో రైతులు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని అలాగే నియోజకవర్గానికి , రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఆ దేవుడి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నాను అని అన్నారు.రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని రాష్ట్రానికి ఏ అడ్డంకులు ఉన్నాయా అవి తొలగిపోయి దేశంలోనే మన రాష్ట్రం నెంబర్ వన్ గా ఉండాలని నరసింహ స్వామి నీ కోరుకున్న అన్నారు.

దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ అందరం కలిసి చేయాల్సిన పనిని రాంకో సిమెంట్ వారు ఒక్కరే చేశారు. నిర్మించిన ఈ దేవాలయం దాదాపు 500 సంవత్సరాల నాటి ఆలయం ఐదున్నర కోట్లతో సరిపోతాది అనుకొని నిర్మాణం చేపడితే ఏడున్నర కోట్లు ఖర్చు వచ్చిందని ఈ టెంపుల్ ఇంకా ఎంతైనా ఖర్చు పెట్టి అభివృద్ధిలోకి తెస్తామని రాంకో సిమెంట్ యాజమాన్యం హామీ ఇవ్వడం జరిగిందని మంత్రి ఆనం నారాయణరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.



## మంత్రి ఆనంను సత్కరించిన బీసీ జనార్దన్ రెడ్డి దంపతులు

మనగళం, బనగానపల్లె : రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని బుధవారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఇందిరమ్మ దంపతులు సత్కరించారు. బనగానపల్లెలోని మంత్రి బీసీ స్వగృహానికి విచ్చేసిన ఆనం రామనారాయణరెడ్డిని శాలువాతో సత్కరించి, గణేశుడు, అయోధ్య బాలరాముడి ప్రతిమలు అందజేశారు.

## భూ కేటాయింపులలో మార్గదర్శకాలు పాటించాలి

**– జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్**

మనగళం, సంజామల: అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి భూమి కేటాయింపులు చేసే సందర్భంలో ప్రభుత్వ మార్గదర్శకాలను, నియమ నిబంధనలను పక్కాగా పాటించాలని జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సంజామల మండలం నొస్సం గ్రామంలో ఎకరూన్ కంపెనీకి భూమి కేటాయింపు అంశంలో అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో జేసీ పర్యటించారు. ఈ సందర్భంగా సదరు కంపెనీ ప్రతిపాదనలు, కేటాయించాల్సిన భూమి విస్తీర్ణం, వాటికి గల సాధ్యాసాధ్యాలు, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అక్కడి మ్యాపులను కూడా జేసి పరిశీలించారు. అనంతరం వివిధ అంశాలలో చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు.




## నేడు అవుకు కు మంత్రి బిసి రాక.



మన గళం అవుకు : నంద్యాల జిల్లా అవుకు పట్టణానికి గురువారం రాష్ట్ర రోడ్లు ,భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి రానున్నట్లు ఆంధ్రప్రదేశ్ గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అరుణ్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా అరుణ్ నాయక్ మాట్లాడుతూ అవుకు తిమ్మరాజు చెరువు ( పెద్ద చెరువు) నుంచి గాలేరు నగరి సుజల స్రవంతి కాలువ ద్వారా నీటిని గేట్ల లిఫ్టింగ్ ద్వారా గండికోటకు నీటిని తరలించే కార్యక్రమానికి హాజరవుతున్నట్లు తెలిపారు. కావున మండలంలోని కూటమి నాయకులు,కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## భూమి యజమానితో సంభంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి సిపిఐ డిమాండ్

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో కోడుమూరు భూమి యజమానులతో సంభంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి రాజు, సిపిఐ పట్టణ కార్యదర్శి శేషు కుమార్, ఎపి రైతు సంగం నాయకులు రాజు, గుంటెప్ప లు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సచివాలయం 1 లోని అధికారులకు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వం వెంటనే గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. వారు విమర్శించారు ఈ కార్యక్రమంలో గొల్ల వెంకటేష్, బాలు, మూగన్న, నాగయ్య, కురువ వెంకటేష్, గుంటెప్ప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు



## కోడుమూరు మండలం క్రిష్ణాపురం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యకమం

మన గళం కోడుమూరు: కోడుమూరు మండలం క్రిష్ణాపురం గ్రామంలో నిర్వహించిన "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యకమంలో కొడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ పాల్గొని ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు కరపత్రాలు అందజేసి వివరించడం జరిగింది అనంతరం ప్రభుత్వం అమలు సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని ప్రజల నుంచి సమస్యలను స్వీకరించడం జరిగింది సూపర్ సిక్స్ పథకాలతో సహా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి, రాష్ట్రాన్ని మళ్లీ సంక్షేమ,అభివృద్ధిపథంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ గ్రామంలో తల్లికి వందనం ద్వారా 645ఐ13,000=8,385,000. రావడం మరియు ఎస్సీ వాళ్ళు అందరూ 200 యూనిట్స్ ఉచిత కరెంటు ఈ గ్రామంలో అందరూ పొందడం వల్ల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రివర్యులు నారాలోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సూపర్ -6 పథకాలు అన్ని అమలు చేస్తామని అభివృద్ధి నీ సంక్షేమాన్ని అమలుచేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు.. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్,టీడీపి నాయకులు, కూటమి నాయకులు మరియు గ్రామ ప్రజలు ,బూత్ ఇన్చార్జి లు ,యూనిట్ ఇన్చార్జి లు ,సచివాలయం



సిబ్బంది మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

## శ్రీశైలం ముఖద్వారం వద్ద ఎలుగుబంటి సంచారం



మనగళం శ్రీశైలం : శ్రీశైలం-సున్నిపెంట రోడ్డులోని ముఖద్వారం వద్ద బుధవారం సాయంత్రం 5:15 గంటల సమయంలో ఎలుగుబంటి సంచరిస్తూ ప్రయాణికులకు కనిపించింది. బస్సులోని ప్రయాణికులు వీడియో తీశారు. ఇటీవల ఈ ప్రాంతంలో ఎలుగుబంటి సంచారం పెరుగుతుండటంతో రాత్రి వేళల్లో టూవీలర్లపై వచ్చే యాత్రికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## కోడుమూరు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిర అవగాహన సదస్సు

కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ నందు డాక్టర్ ఎం. రవి కిరణ్ శ్రీ దత్త సాయి దంత వైద్య శాల వారి సౌజన్యముతో ప్రిన్సిపాల్ అయినటువంటి శ్రీ షేక్షావలి అధ్యక్షతన ఉచిత దంత వైద్య శిబిర అవగాహన సదస్సు జరిగినది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు దంతల పరిరక్షణ దంతాలను రక్షిస్తే ఆరోగ్యము బాగుంటుందనే విషయాలు వివరించారు. డాక్టర్ ఎం రవి కిరణ్ ఉచితంగా దంత చికిత్స విద్యార్థులకు అందించారు ప్రతి విద్యార్థిని విద్యార్థులకు మరియు కాలేజీ సిబ్బందికి ఉచితంగా బ్రష్ పేస్టులు అందించారు. ఇందులో కోడుమూరు అభివృద్ధి కమిటీ అధ్యక్షులు డాక్టర్ షాకీర్ జనరల్ సెక్రెటరీ జయన్న వ్యవస్థాపకులు కృష్ణయ్య సలహాదారులు హనుమంతప్ప వైస్ ప్రెసిడెంట్ జయరాం జాయింట్ సెక్రటర్ ఉషనప్ప స్వామి వీరన్న మరియు కళాశాల లెక్చరర్స్ శారద మేడం శ్రీనివాసులు మరియు మిగతా లెక్చరర్స్ ఆఫీసు సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు మొదలైన వారు పాల్గొనడం జరిగింది.



# రైతుల ఎన్పీసీఐ ఖాతాలను పునరుద్ధరించండి

- మ్యాపింగ్ తప్పనిసరి...పెండింగ్ ఈ-కెవైసిని పూర్తి చేయాలి
- అర్హులైన రైతులు.. ఒక్కరూ కూడా మిస్ కారాదు
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



మనగళం, నంద్యాల: అన్నదాత సుఖీభవ లబ్ధి కోసం ఇన్ యాక్టివ్ ఉన్న రైతుల ఎన్పీసీఐ ఖాతాలను వెంటనే పునరుద్ధరించుకునేలా వేగవంతంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి అన్నదాత సుఖీభవ, యూరియా లభ్యత అంశాలపై రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 2వ తేదీన రాష్ట్రంలో ఉన్న రైతులకు ఆర్థిక స్వాలంబన కోసం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా చేయూత ఇవ్వడం జరుగుతోందన్నారు. జిల్లాలో సుమారుగా 2.07 లక్షల మంది రైతులకు ఉన్నారని, అందులో 1.97 లక్షల మందికి ఈకెవైసి, ఎన్పిసిఐ ఖాతాలు మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. మిగతా రైతులకు కూడా వెంటనే ఈకెవైసి, ఎన్పిసిఐ మ్యాపింగ్ అయ్యేలా చూడాలని రెవెన్యూ, వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వివిధ మండలాలలో ఇంకను 2,463 రైతులకు ఈకెవైసి పెండింగ్ ఉన్నాయని తక్షణం వాటిని పూర్తి చేయాలన్నారు. అదే విధంగా ఎన్పిసిఐ ఇన్ ఆక్టివ్ మరియు నాట్ మ్యాపింగ్ కు సంబంధించి దాదాపు 6వేల మంది ఉన్నారని, త్వరగా పరిష్కార చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, వాటిని అవసరం మేరకు మాత్రమే వినియోగించుకోవాలని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 700 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, వాటితోపాటు ఇంకా అదనంగా 1300 మెట్రిక్ టన్నుల యూరియా కూడా జిల్లాకు వస్తోందన్నారు. అదేవిధంగా నానో యూరియా పై కూడా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఒక బ్యాగ్ యూరియా అర్ధ బాటిల్ నానో యూరియాకు సమానమన్న విషయాన్ని రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్లో జేసీ విష్ణు చరణ్, ఆర్డీవోలు తసీల్దార్లు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, మార్క్ఫెడ్, ఎల్డీఎం, సంబంధిత మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరులో మెప్మాలో పని చేస్తున్నటువంటి రిసోర్స్ పర్సన్స్ ల పెండింగ్ లో ఉన్న ఐదు నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం గూడూరు పట్టణంలో మెప్మాలో పని చేస్తున్నటువంటి రిసోర్స్ పర్సన్స్ (%ॠ%) ల పెండింగ్ లో ఉన్న ఐదు నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలని అదనపు పనులు అప్ప చెప్పకూడదని గ్రేడింగ్ విధానం రద్దు చేయాలని, గూడూరులో సిఐటియు ఆధ్వర్యంలో మెప్మా ఆర్పీలు %uవీజ% రాములు వినతిపత్రం ఇవ్వడం జరిగింది,,, ఈ సందర్భంగా మెప్మా రిసోర్స్ పర్సన్స్, (%ॠ% ) ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి, సిఐటియు డివిజన్ కార్యదర్శి జే, మోహన్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు యశోద,భారతి,లు మాట్లాడుతూ ఆర్పీల జీతాలు ఐదు నెలలుగా పెండింగ్లో ఉన్నాయని, జీతాలు లేక ఆర్పిలు తమ కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని, వెంటనే పెండింగ్ జీతాలు విడుదల చేసి ఆర్పి లను ఆదుకోవాలని, ఆర్పీల వేతనాల కొరకు రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్ కేటాయించి నెలనెల వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, మెప్మా ఆర్పీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, ఆర్పీలకు అదనపు పనుల భారం ఎక్కువైందని, అదన పని భారాన్ని వెంటనే తగ్గించాలని, ఆర్పీలకు టిఏలు ఇచ్చి, గ్రేడింగ్ విధానం రద్దు చేయాలని, అర్హత కలిగిన ఆర్పీలను సి ఓ, మరియు డీఈవోగా ప్రమోషన్ ఇవ్వాలని, ఆర్పీల వేతనం వారి వ్యక్తిగత అకౌంట్లో జమ చేయాలని, ఆర్పి లకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, ఆర్పీల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో గూడూరు మెప్మా ఆర్పీలు పార్వతి, రేష్మ,నాగలక్ష్మి, శిరీష, లింగేశ్వరి, ప్రభావతి, ఫరీదా, మల్లీశ్వరి, షమీం, కళావతి, పద్మావతి, రామాంజనమ్మ తదితర ఆర్పి లు పాల్గొన్నారు

# శ్రీశైలం లోని హొటల్ నిర్వహకులతో సమావేశం




మనగళం శ్రీశైలం : శ్రీశైలదేవస్థానం పరిధిలో హోటళ్ళ నిర్వాహకులతో ఈరోజు(30.07.2025) కార్యనిర్వహణాధికారి వారు సమీక్షా సమావేశం నిర్వహించారు. మల్లికార్జున కల్యాణమండపంలో జరిగిన ఈ సమావేశంలో నంద్యాల జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్లు, నంద్యాల జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్లు దేవస్థానం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ హోటళ్ళ నిర్వాహకులందరు శుచీశుభ్రతలను పాటించాలన్నారు. ఈ విషయమై ఎప్పటికప్పుడు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా వంటకాలలో తాజా కూరగాయలనే వాడాలన్నారు. భోజన అల్పాహార తయారీలో వినియోగించే పాత్రలను కూడా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఆయా వంటపాత్రలపై తప్పనిసరిగా మూతలను పెడుతుండాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో వంట వార్పు చేయకుండా ఉండాలని సూచించారు. అవసరానికి తగినంత మాత్రమే ఆహారపదార్థాలను అందుబాటులో ఉంచాలన్నారు. నిల్వ ఉన్న ఆహారపదార్థాలను అందించరాదని అన్నారు. అలాగే ఆహారపదార్థాల తయారీలో వాడే ముడిసరుకుల యొక్క నాణ్యతను, ప్రమాణాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దారించిన నియమాలకు అనుగుణంగా ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అపరిశుభ్రత వాతావరణం గల ప్రాంతాలలో ఆహారపదార్థాలను నిల్వ ఉంచరాదని అన్నారు. హోటళ్ళల్లో పనిచేయువారందరు కూడా భక్తుల యెడల మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. హోటళ్ళయందు 18 సంవత్సరాలలోపు బాలబాలికలను పని నిమిత్తం వినియోగించరాదన్నారు. దేవదాయచట్టం ప్రకారం నిషేధిత పదార్థాలను విక్రయించరాదని పేర్కొన్నారు. శుచిశుభ్రమైన వంటగదిలో నాణ్యమైన ముడిసరుకులతో రుచికరమైన ఆహారాన్ని భక్తులకు అందించడం ఎంతైనా అవసరమన్నారు. హోటళ్ళ పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మికతతో భక్తులను ఆకట్టుకునేలా ఉండాలన్నారు. హోటళ్ళలో హానికరమైన జంక్ ఫుడ్ను సాధ్యమైనంత మేరకు తొలగించాలని అన్నారు. హోటళ్ళలో పనిచేసే సిబ్బంది చేతికి గ్లౌజులను తలకు క్యాపులను తప్పనిసరిగా ధరించాలన్నారు. తయారు చేసిన ఆహారపదార్థాలపై ఈగలు, ఇతర క్రిమికీటకాలు వాలకుండా, దుమ్ము ధూళీ పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతినెలలో రెండుసార్లు రెవెన్యూ, శానిటేషన్, ఫుడ్ఇన్స్పెక్టర్లతో ఆహార పదార్థాలపై, హోటళ్ళ నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు చేయిస్తామన్నారు. ఈ తనిఖీలలో నియమాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని, అంతేకాక భక్తుల నుంచి అధిక సంఖ్యలో ఫిర్యాదులు వచ్చినా తగిన చర్యలు తీసుకోబడతాయని పేర్కొన్నారు. అపరాధరుసుము మూడుసార్లు దాటిన యెడల సంబంధిత హోటల్ లీజును రద్దు చేస్తామన్నారు. అంతేకాక హోటళ్ళ యందు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ పేపర్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ బాటిల్స్ వంటి వాటిని పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. టీ, కాఫీ మొదలైన వాటిని మరియు మంచినీటిని కేవలం గాజు లేదా స్టీల్ గ్లాసులలో మాత్రమే అందించాలని అన్నారు. ఈ గ్లాసులను విధిగా వేడినీటితో శుభ్రం చేయాలన్నారు. ప్రతి హోటల్ వద్ద తప్పనిసరిగా చెత్తబుట్టలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఫుడ్ సేఫ్టీ అధికారులు మాట్లాడుతూ హోటళ్ళ నిర్వాహకులందరు ఆహారపదార్థాల తయారీ పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐ.వి.ఆర్ సిస్టం ప్రకారం ప్రతి ఒక్కరు ఆహార పదార్థాలను సిద్ధం చేయాలన్నారు. టెస్టింగ్ సాల్ట్ మరియు ఫుడ్ కలర్సు వాడడాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. అలాగే సహజ ఫుడ్ కలర్సును తక్కువ మోతాదులో వాడుకోవాలని అన్నారు. కూరగాయలను కొనుగోలు చేసిన వెంటనే శుభ్రమైన నీటితో కడిగి ఉపయోగించాలన్నారు. ప్రతి హోటల్ యజమాని తప్పనిసరిగా ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ వారియొక్క లైసెన్సును కలిగి ఉండాలన్నారు. భక్తుల ఫిర్యాదుల మేరకు సరైన ఆహారపదార్థాలను అందించని హోటళ్ళ యజమానుల మీద శాఖాపరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. అలాగే ఎం.ఆర్.పి రేట్లను మించి అధిక ధరలకు విక్రయిస్తున్న వారి మీద లీగల్ మెట్రాలజీ డిపార్టుమెంట్ వారు తగిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు. ఈ కార్యక్రమములో సహాయ కార్యనిర్వహణాధికారి బి. మల్లికార్జునరెడ్డి, ప్రజాసంబంధాల అధికారి టి. శ్రీనివాసరావు, పర్యవేక్షకులు డి. రాధకృష్ణ, స్థానిక హోటళ్ళ యజమానులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రీ శ్రీ సాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం



మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (30.07.2025) ఉదయం సాక్షిగణపతిస్వామి వారికి విశేష అభిషేకాన్ని నిర్వహించింది. కాగా ప్రతి బుధవారం, సంకటహరచవితిరోజులు మరియు పౌర్ణమిరోజులలో శ్రీసాక్షిగణపతి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానం సేవగా (సర్కారి సేవగా) నిర్వహించబడుతున్నాయి. ఈ ఉదయం సాక్షిగణపతిస్వామివారికి పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి. వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ గణపతి అభిషేకం వలన అనుకున్న పనులలో ఆటంకాలు తొలగి విజయం లభిస్తుందని చెప్పబడుతోంది. అలాగే కోరిన కోరికలు నెరవేరుతాయని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరిగి విద్య బాగా వస్తుందని చెప్పబడుతోంది. కాగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. భక్తులు శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించినట్లుగా కైలాసంలో పరమేశ్వరుని వద్ద ఈ స్వామి సాక్ష్యం చెబుతాడని ప్రసిద్ధి. అందుకే ఈ స్వామి సాక్షిగణపతిగా పేరొందాడు. చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు.

# ఆలయప్రాంగణములోని వీరభద్రస్వామికి విశేష పూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (30.07.2025) సాయంకాలం ఆలయ ప్రాంగణం లోని వీరభద్రస్వామివారికి (బయలువీరభద్రస్వామివారికి) విశేషపూజలను నిర్వహిస్తోంది. ఆలయప్రాంగణంలో మల్లికార్జునస్వామివారి ఆలయానికి ఉత్తరభాగంలో మల్లికాగుండానికి ప్రక్కనే ఉన్న వీరభద్రస్వామి జ్వాలామకుటంతో పదిచేతులతో విశిష్టరూపంలో దర్శనమిస్తాడు. శిల్పశాస్త్ర పరిభాషలో ఈ స్వామికి అఘోరవీరభద్రమూర్తి అని పేరు కూడా ఉంది. స్వామివారికి ప్రక్కనే దక్షప్రజాపతి కనిపిస్తాడు. ఈ స్వామిని పరివార ఆలయాలలో భాగంగా ప్రతినిత్యం పూజించడం జరుగుతోంది. కాగా ప్రతి బుధవారం ప్రదోషకాలంలో విశేష అభిషేకం కార్యక్రమం దేవస్థానం నిర్వహిస్తోంది. ఈ పూజావలన లోకశాంతి, దుర్భిక్షనివారణ, భక్తుల అనుకున్న కోరికలు నెరవేరుతాయి. ముఖ్యంగా క్షేత్ర అభివృద్ధి జరుగుతుంది. కాగా ఈ పూజలలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజను నిర్వహించబడుతుంది. తరువాత వీరభద్రస్వామికి పంచామృతాలతోనూ, పలురకాల ఫలోదకాలతోనూ, గంధోదకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, హరిద్రోదకంతోనూ మరియు మల్లిక గుండంలోని శుద్ధజలంతో విశేష అభిషేకం నిర్వహించడం జరుగుతుంది. ఈ అభిషేకాల తరువాత విశేషంగా స్వామివారికి పుష్పార్చనను జరిపించబడుతుంది.

# జిల్లా న్యాయ సేవా సదన్ లో అవగాహన సదస్సు

మనగళం, కర్నూలు సిటీ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది ఆదేశాల మేరకు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో బుధవారం మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. మానవ అక్రమ రవాణా తీరుపై చర్చించడం జరిగింది. ముఖ్యంగా మానవ అక్రమ రవాణా అత్యంత దుర్మార్గమైన, మానవ హక్కుల ఉల్లంఘన అని తెలియజేశారు. ఇది ప్రధానంగా లైంగిక దోపిడీ, వెట్టి చాకిరి, బానిసత్వం, రూపాల్లో ఉంటుందన్నారు. మానవ అక్రమ రవాణాను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా శిశు సంరక్షణ అధికారి నిర్మల, మహిళ పీఎస్ సీఐ విజయలక్ష్మి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరామచంద్ర రావు, సులోచన, న్యాయవాది ఆశాబాయి, ఇతర న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్స్, ఎన్జీవోలు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



# ధర్మో రక్షతి రక్షితః


మన గళం,సినిమా : జగదీష్ ఆమంచి నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన మైథలాజికల్ సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ 'యముడు'. 'ధర్మో రక్షతి రక్షితః' అనేది ఉపశీర్షిక. శ్రావణి శెట్టి కథానాయిక. త్వరలో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ఈ సినిమా ఆడియో లాంచ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అతిథులుగా విచ్చేసిన నిర్మాత బెక్కెం వేణుగోపాల్, కె మ్యూజిక్ సీఈవో ప్రియాంక ఆడియోను లాంచ్ చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. జగదీష్ ఆమంచి మాట్లాడుతూ 'ప్రస్తుతం ఎక్కడ చూసినా అక్రమ సంబంధాలు, హత్యలు, కుట్రలకు చెందిన వార్తలే వినిపిస్తున్నాయి. ఆ పాయింట్‌లోనే ఈ సినిమా తీశాను. అందరినీ ఆలోచింపజేసే సినిమా ఇది' అని తెలిపారు. ఇంకా శ్రీమల్లిక, శ్రావణి శెట్టి, ఆకాష్, సంగీత దర్శకుడు భవానీ రాకేష్, స్క్రీన్‌ప్లే రైటర్ శివ కుంద్రపు, డీవోపీ విష్ణురెడ్డి వంగా తదితరులు మాట్లాడారు. ఈ చిత్రానికి రచన: హరి అల్లసాని, జగదీష్ ఆమంచి, నిర్మాణం: జగన్నాథ పిక్చర్స్.

# కన్నడ కస్తూరి మరో బంపరాఫర్ కొట్టేసింది..!





మన గళం,సినిమా : కన్నడ కస్తూరి రుక్మిణి వసంత్‌కు మహర్దశ మొదలైంది. 'సప్తసాగరాలు దాటి' సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకుల దృష్టిని కూడా ఆకర్షించిన ఈ బెంగళూరు భామ.. ప్రస్తుతం తమిళంలో విరివిగా సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. శివకార్తికేయన్‌కు జోడీగా ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో తాను నటించిన 'మదరాసీ' చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ సినిమాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నానని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలియజేశారు రుక్మిణి వసంత్. ఇదిలావుంటే.. 'మదరాసీ' విడుదల కాకముందే కోలీవుడ్‌లో మరో బంపర్ ఆఫర్ ఈ అందాల భామను వరించింది. తమిళ అగ్ర నటుడు విక్రమ్ కథానాయకుడిగా '96'ఫేం ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ నిర్మిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రంలో రుక్మిణి వసంత్ కథానాయికగా ఎంపికైంది. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌కు వెళ్లనున్నట్టు సమాచారం. ఎన్టీఆర్-ప్రశాంత్‌నీల్ చిత్రంలోనూ రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.




# అలా చేయడం తప్పేం కాదు..!

మన గళం,సినిమా : 'ఈ రోజుల్లో అందంగా కనిపించేందుకు ప్రతి ఒక్కరూ కాస్మోటిక్ సర్జరీలు చేయించుకుంటున్నారు. అదేం తప్పు కాదు. అయితే.. ఈ విషయంలో మహిళలను మాత్రమే బ్లేమ్ చేయలేం. కాస్మోటిక్ సర్జరీలను ఆశ్రయిస్తున్న పురుషులు ఈ రోజుల్లో చాలామంది ఉన్నారు. అంతెందుకు సినీ పరిశ్రమలోనే అలాంటి వాళ్లు కోకొల్లలు.' అంటూ బాంబ్ పేల్చారు ఒకనాటి బాలీవుడ్ అందాలతార కాజోల్. ఆమె నటించిన 'సర్ జమీన్' చిత్రం రీసెంట్‌గా ఓటీటీలో విడుదలైంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అందం, గ్లామర్ గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు కాజోల్. 'అందం లేనివాళ్లు అందంగా కనిపించాలని కోరుకోవడంలో తప్పేంలేదు. కెమెరా ముందు నటించే అవకాశం ఉన్నప్పుడు, అందం కోసం కొన్ని ప్రయత్నాలు చేయడం సమర్ధనీయమే. అలాంటి వారిని జడ్జ్ చేయకూడదు.' అని హితవు పలికారు కాజోల్. వయసు గురించి మాట్లాడుతూ 'ఈ మధ్య నా వయసు కొందరు సోషల్ మీడియావాళ్లకు సమస్యగా మారింది. నా దృష్టిలో ఏజ్ అనేది ఓ నంబర్ అంతే. జీవించడానికి నాకెన్నో అద్భుతమైన సంవత్సరాలు ఇంకా మిగిలివున్నాయి.' అంటూ పేర్కొన్నారు కాజోల్.

# పవన్ కల్యాణ్‌కు కంగనారనౌత్ ఫస్ట్ ఛాయిస్ అట..
## బాలీవుడ్ క్వీన్ క్రేజీ రిప్లై





మన గళం,సినిమా : టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కల్యాణ్ తొలిసారి హరిహరవీరమల్లు ప్రమోషన్స్ బాధ్యతను తీసుకున్న విషయం తెలిసిందే. ఇదివరకెన్నడూ లేని విధంగా ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు. ఓ హిందీ మీడియాతో జరిపిన చిట్ చాట్ సెషన్‌లో పవన్ కల్యాణ్ చేసిన కామెంట్స్‌పై స్పందిస్తూ రిప్లై ఇచ్చింది బాలీవుడ్ భామ కంగనరనౌత్. బాలీవుడ్ హీరోయిన్‌తో నటించాల్సి వస్తే.. ఎవరికి ఛాన్స్ ఇస్తారని పవన్ కల్యాణ్‌ను అడిగారు. దానికి కంగనారనౌత్ పేరు చెప్పాడు పవన్ కల్యాణ్. ఎమర్జెన్సీలో కంగనారనౌత్ ఇందిరాగాంధీ పాత్రను పోషించిన తీరు బాగుంటుందని.. నేను ఖచ్చితంగా కంగనారనౌత్ లాంటి బలమైన వ్యక్తితో కలిసి పనిచేస్తానంటూ చెప్పాడు. ఇక ఈ కామెంట్స్ కాస్తా వైరల్ అయి కంగనారనౌత్ దాకా వెళ్లాయి. పవన్ కల్యాణ్ కామెంట్స్‌పై ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో స్మైలింగ్ (ప్రేమతో నవ్వుతూ), నమస్తే ఎమోజీలతో సమాధానమిచ్చింది. ఇది కాస్తా నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. పవన్ కల్యాణ్, కంగనారనౌత్.. ఇద్దరూ కూడా క్రిష్ దర్శకత్వంలో పనిచేశారని తెలిసిందే. అయితే ఈ ఇద్దరు కలిసి మాత్రం నటించలేదు. మరి పవన్ కల్యాణ్ కామెంట్స్, కంగనా రియాక్షన్‌తో ఈ ఇద్దరు కలిసి ఓ సినిమా చేయాలని కోరుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు. ఈ క్రేజీ కాంబో సిల్వర్ స్క్రీన్‌పై వస్తుందా.. లేదా.. ? అనేది కాలానికే వదిలేయాలి.

# నైంటీస్ స్టార్స్ రీయూనియన్ సందడి..!

మన గళం,సినిమా : ఈ మధ్య అలనాటి తారలు అందరు ఏదో ఒక సందర్భంలో కలిసి సందడి చేయడం మనం చూస్తూ ఉన్నాం. 80వ దశకంకి చెందిన తారలు సంవత్సరానికి ఒకసారి కలిసి తెగ హంగామా చేస్తుంటారు. 90వ దశకంలో స్టార్ డమ్ పొందిన సినీ ప్రముఖులు కూడా ప్రతి ఏడాది ఒకే చోట కలుసుకొని రీయూనియన్ పార్టీ చేసుకోవడం ఒక ట్రెడిషన్‌గా మారిపోయింది. ఈ ఏడాది ఆ ప్రత్యేక సమ్మేళనానికి గోవా వేదిక అయింది. అక్కడ చోటుచేసుకున్న జాయ్‌ఫుల్ సెలబ్రేషన్స్, సెలెబ్రిటీల సందడికి సంబంధించిన పిక్స్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.



# ఫ్యాషన్ ఈవెంట్‌లో జాన్వీ కపూర్ సందడి..!

మన గళం,సినిమా : బాలీవుడ్ యంగ్ బ్యూటీ, అలనాటి అందాల తార శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ ఓ ఫ్యాషన్ ఈవెంట్‌లో తళుక్కున మెరిశారు. న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ లో జరుగుతున్న హ్యుందాయ్ ఇండియా కౌచర్ వీక్ 2025లో సందడి చేశారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ జయంతి రెడ్డి రూపొందించిన పింక్ కలర్ లెహంగాలో ర్యాంప్ వాక్ చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను జాన్వీ ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఇక సినిమాల విషయానికొస్తే ఎన్టీఆర్ సినిమా దేవరతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన జాన్వీ కపూర్.. ప్రస్తుతం రామ్ చరణ్‌తో కలిసి పెద్ది చిత్రంలో నటిస్తుంది. ఈ సినిమాకు బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్నారు. దీంతో పాటు హెూమ్‌బౌండ్, సన్నీ సంస్కారి కి తులసి కుమారి, పరమ్ సుందరి లాంటి బాలీవుడ్ సినిమాల్లో కనిపించనుంది.





## పిచ్ క్యూరేటర్‌తో గంభీర్ వాగ్వాదం..! 'తగ్గేదేలే' అంటూ వార్నింగ్..?



మన గళం, మాంచెస్టర్‌లో అద్భుత పోరాటంతో మ్యాచ్‌ను డ్రాగా ముగించిన భారత జట్టు ఓవల్ టెస్టుకు సన్నద్ధమవుతోంది. నిర్ణయాత్మక ఈ మ్యాచ్‌కు ఇంకా రెండు రోజులే ఉండడంతో గట్టిగా నెట్స్‌లో చెమటోడ్చుతోంది గిల్ బృందం. అయితే.. భారత క్రికెటర్లు ప్రాక్టీస్ చేస్తుండగా ఓవల్ పిచ్ క్యూరేటర్ అభ్యంతరం తెలిపాడు. దాంతో, హెడ్‌కోచ్ గౌతం గంభీర్ అతడితో వాగ్వాదానికి దిగాడు. అసలు ఎందుకు వీరిద్దరూ గొడవపడ్డారంటే..? మంగళవారం రోజు భారత క్రికెటర్లు ఓవల్ మైదానంలో నెట్స్ ప్రాక్టీస్ చేస్తున్నారు. కోచ్ గంభీర్, బ్యాటింగ్ కోచ్ సితాన్స్ కొటాక్ ఆటగాళ్లను గమనిస్తున్నారు. ఈ సమయంలోనే పిచ్ క్యురేటర్ లీ ఫోర్టిస్ అక్కడికి వచ్చాడు. అతడు ఇదేంటీ మీరు ఎక్కువ ఇక్కడ సాధన చేస్తున్నారు? మీకు అనుమతి ఇచ్చింది అక్కడి వరకేగా అని అన్నాడు. మామూలుగానే ముక్కు మీద కోపంతో ఊగిపోయే గౌతీకి అతడలా అనేసరికి చిర్రెత్తుకొచ్చింది. 'నువ్వు కేవలం మైదానం సిబ్బంది మాత్రమే. మేము ఇక్కడే ప్రాక్టీస్ చేసుకుంటాం. మేము ఏం చేయాలో నువ్వు చెప్పనక్కర్లేదు. మాకు అన్నీ తెలుసు అని ఎవరికి ఫిర్యాదు చేస్తావో చేసుకో' అని అతడితో తెగేసి చెప్పాడు. గంభీర్ ఒక్కసారిగా అలా అనేసరికి ఫోర్టిస్‌కు ఏం చేయాలో పాలుపోలేదు. బ్యాటింగ్ కోచ్ అతడికి సర్ది చెప్పాడు. ప్రస్తుతం టీమిండియా కోచ్, క్యురేటర్ ఫోర్టిస్‌ల వాగ్వాదానికి సంబంధించిన వీడియో నెట్టింట వైరలవుతోంది.

గెలిచి తీరాల్సిందే : భారత్, ఇంగ్లండ్‌ల మధ్య జూలై 31 బుధవారం చివరిదైన ఐదో టెస్టు జరుగనుంది. ప్రస్తుతానికి రెండు జట్లు ఆతిథ్య జట్టు రెండేసి విజయాలతో ముందజంలో ఉంది. మాంచెస్టర్‌లో డ్రాతో బతికిపోయిన టీమిండియా గెలిచి తీరాల్సిందే. డ్రా చేసుకున్నా సరే స్టోక్స్ సేన విజేతగా నిలుస్తుంది. సో.. ఏవిధంగా చూసినా ఓవల్ టెస్టు గిల్ బృందానికి చావోరేవో లాంటిదే. కుడి పాదం వేలి గాయంతో వైస్ కెప్టెన్ పంత్ దూరమవ్వడం కొంత ఇబ్బందికరమే. అతడి స్థానంలో ఎవరిని తీసుకుంటారనేది తెలియాల్సి ఉంది. అయితే.. నాలుగో టెస్టుకు విశ్రాంతితీసుకున్న ఆకాశ్ దీప్, అర్షదీప్ సింగ్‌లు కోలుకోవడంతో భారత బౌలింగ్ యూనిట్ మరింత బలంగా మారనుంది.



## కోల్‌కతా హెడ్‌కోచ్ రాజీనామా..?



మన గళం, ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్‌కు హెడ్‌కోచ్ చంద్రకాంత్ పండిట్ భారీ షాకిచ్చాడు. ఉన్నట్టుండి బాధ్యతల నుంచి వైదొలిగాడు చంద్రకాంత్. మూడేళ్లుగా కోచ్‌గా కొనసాగిన ఆయన మంగళవారం నాడు నా దారి నేను చూసుకుంటా అంటూ పదవికి రాజీనామా చేశాడు. ఆయన నిర్ణయాన్ని గౌరవిస్తూ.. ఫ్రాంచైజీ కూడా అమోదం తెలిపింది. థాంక్యూ చందు సర్ అంటూ కోల్‌కతా యాజమాన్యం ఎక్స్ వేదికగా వీడ్కోలు పోస్ట్ పెట్టింది. 'కోల్‌కతాకు కోచ్‌గా విశేష సేవలందించిన చంద్రకాంత్ కొత్త అవకాశాల్ని అందిపుచ్చుకోవాలని అనుకుంటున్నాడు. ఆయన ఇకపై మా జట్టు హెడ్‌కోచ్‌గా ఉండడు. ఈ మూడేళ్ల సమయంలో మీ అమూల్యమైన సేవలకు ధన్యవాదాలు. కోల్‌కతాను మూడోసారి ఐపీఎల్ విజేతగా నిలిపిన ఘనత మీది. అంతేకాదు మీ క్రమశిక్షణతో, నాయకత్వ నైపుణ్యంతో స్క్వాడ్‌ను పటిష్టంగా మార్చారు. మీ భవిష్యత్తుకు ఆల్ ది బెస్ట్' అని కోల్‌కతా ఫ్రాంచైజీ ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చింది. అయితే.. హఠాత్తుగా చంద్రకాంత్ వైదొలగడంపై కొన్ని అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈమధ్యే కోల్‌కతా అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ డబ్ల్యూపీల్ జట్టు యూపీ వారియర్స్‌కు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఈ క్రమంలో.. చంద్రకాంత్ కూడా ఏదైనా డబ్ల్యూపీఎల్ జట్టు కోచ్ పదవి ఆశిస్తున్నాడా..? అనేది తెలియాల్సి ఉంది.

## మరో ఆటగాడిని అనుమతించాలి : గంభీర్



మన గళం, మ్యాచ్ సందర్భంగా క్రికెటర్ తలకు గాయమైతే కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా అతడి స్థానంలో మరో ప్లేయర్‌ను అనుమతిస్తుంటారు. అలా వచ్చే ఆటగాడికి బ్యాటింగ్, బౌలింగ్ చేసే అవకాశం ఉంటుంది. అయితే తల కాకుండా ఇతర శరీర భాగాలకు గాయాలైతే ఈ వెసులుబాటు లేదు. ఇదే విషయమై భారత జట్టు కోచ్ గంభీర్ స్పందించాడు. 'ఓ ఆటగాడి గాయం తీవ్రతను రెఫరీ, అంపైర్ పరిశీలించాక సబ్‌స్టిట్యూట్‌ను ఆడించడంపై నిర్ణయం తీసుకోవాలి. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో సిరీస్ హెూరాహెూరీగా సాగుతోంది. ప్రత్యర్థి 11 మంది ఆటగాళ్లతో ఆడుతుంటే మేం పది మందితో ఎలా పోరాడగలం..?' అని గంభీర్ ప్రశ్నించాడు.

## శార్దూల్ అన్షుల్ కష్టమే



మన గళం,మాంచెస్టర్: నాలుగో టెస్టులో విఫలమైన పేసర్లు శార్దూల్ ఠాకూర్, అన్షుల్ కాంబోజ్‌లపై వేటు పడే అవకాశం ఉంది. ఇంగ్లండ్‌తో గురువారం నుంచి జరిగే ఐదో టెస్టులో భారత్ పటిష్ఠ జట్టుతో బరిలోకి దిగాలనుకుంటోంది. ముఖ్యంగా బౌలింగ్ కూర్పుపై దృష్టిసారిస్తోంది. ఎనిమిదో నెంబర్ వరకు బ్యాటర్లు ఉండాలనే ఉద్దేశంలో స్పెషలిస్ట్ బౌలర్ సేవలను కోల్పోవాల్సి వస్తోంది. 2014 తర్వాత ప్రత్యర్థికి 600ం పరుగులు సమర్పించుకున్న భారత్ ఈసారి ఎలాంటి తప్పూ చేయాలనుకోవడం లేదు. అన్షుల్ స్థానంలో ఆకాశ్, అర్షదీప్, ప్రసిద్ధ్ పోటీ పడనున్నారు. ఇక నాలుగో బౌలర్‌గా స్పిన్నర్ కుల్దీపను ఆడించే అవకాశం ఉంది. మరోవైపు భారత జట్టు మాంచెస్టర్ నుంచి సోమవారం రైలులో లండన్‌కు చేరుకుంది. అలాగే నేటి మధ్యాహ్నం 2 గంటల నుంచి తమ ప్రాక్టీసను ఆరంభించనుంది.

## ఆసీస్ క్లీన్‌స్వీప్.. 5-0తో టీ20 సిరీస్ కైవసం




మన గళం,సెయింట్ కిట్స్ : వెస్టిండీస్ పర్యటనను ఆస్ట్రేలియా వరుసగా 8వ విజయంతో ఘనంగా ముగించింది. మూడు టెస్టులు, ఐదు టీ20లు ఆడేందుకు కరీబియన్ గడ్డపై అడుగిడిన ఆసీస్.. టెస్టులను క్లీన్‌స్వీప్ చేయగా తాజాగా టీ20 సిరీస్‌లోనూ ఐదింటికి ఐదూ గెలిచింది. సోమవారం జరిగిన చివరి మ్యాచ్‌లో ప్రత్యర్థికి మొదట బ్యాటింగ్ అప్పగించిన కంగారూలు.. ఆ జట్టు నిర్దేశించిన 171 పరుగుల లక్ష్యాన్ని మరో మూడు ఓవర్లు మిగిలుండగానే ఏడు వికెట్లు కోల్పోయి ఛేదించారు. ఈ సిరీస్ ఆసాంతం రాణించిన కామెరూన్ గ్రీన్ (32)తో పాటు మిచెల్ ఒవెన్ (37) ధాటిగా ఆడగా ఆఖర్లో ఆరోన్ హార్డీ (28లి) మెరుపులతో ఆ జట్టు ఘనవిజయాన్ని సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన విండీస్.. హెట్‌మెయర్ (52), రూథర్‌ఫర్డ్ (35) రాణించడంతో పోరాడే స్కోరును సాధించింది. మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసిన డ్వార్షియస్ (3/41)కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, గ్రీన్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు దక్కాయి







Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310